

## స్నేహం ఎంతో మధురం!.....

వ్యక్తుల మధ్య పరిచయం అంటూ ఏర్పడ్డాక అది క్రమేణా 'స్నేహం'గా రూపుదిద్దుకుంటుంది.

స్నేహితుల వ్యక్తిత్వాల్లో భిన్నత్వం లేనప్పుడే ఆ స్నేహం కొనసాగుతుంది. చుట్టరికపు అనుబంధాలున్న చోట స్నేహానికి తావులేదు.

బాంధవ్యం అన్న పదంలో 'బాధ్యత'అన్న భావం దాక్కుని ఉంది. ఆ కారణంగానే బంధువులు ఒకరిపై ఒకరు ఆధారపడే విధంగా సామాజిక వ్యవస్థ రూపు దిద్దుకుంది.

## ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మీ ఫౌండేషన్ (మద్రాసు) సంయుక్తంగా నిర్వహించిన 1997 కథానిక వ్యాసాల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

స్నేహం అలాంటిది కాదు. అది వ్యక్తుల మానసిక స్థితిగతుల ఆధారంగా ఏర్పడుతుంది.

'స్నేహం' అన్న పదంలో 'సహకారం' అన్న అర్థం ఇమిడివుంది.

స్వలాభాపేక్ష అనే దుర్గుణం లేని సద్గుణ సంఘ భావ రూపం స్నేహం!

స్వార్థత్యాగం అనే అంశం స్నేహంలోని ఓ ముఖ్యాంశంగా గుర్తించబడింది.

వయోభేదం, వర్గభేదం, అంతస్థులూ, స్థాయీభేదం వగైరాలు స్నేహానికి అడ్డురావు.

స్నేహం ఓ అతి పవిత్రమైన మానసిక పరిణామం! అది ఆత్మీయతని పెంపొందింపజేస్తుంది. మైత్రీతత్వాన్ని ఇనుమడింపజేస్తుంది. ఒకరినొకరు బాగా అర్థం చేసుకునేందుకు సహకరిస్తుంది.

అరమరికలూ, అపోహలూ, అనుమానాలూ అనే వికటిత సంఘటిత సంఘర్షణల కలితంగా ఏర్పడే ఓ శక్తి మానసికోన్నత వ్యవస్థ స్నేహం..."

స్నేహానికి ఇంతటి ఉత్తమ వ్యాఖ్యానాన్ని చేసిన శంకరం వ్యక్తిత్వానికి ఒక్కసారిగా దాసోహం అన్నాడు మధు. ఆ క్షణం నుంచే శంకరం అతనికి ఓ శ్రేయోభిలాషిగా మారిపోయాడు. వారిరువురి మధ్యా ఒకరిపై ఒకరికి ఎనలేని విశ్వాసం, అపారమైన అభిమానం ఏర్పడ్డాయి.

— రాత్రి పన్నెండు కావస్తోంది.

అంత రాత్రివేళ కూడా పందిట్లో ఎంతో సందడిగా వుంది.

వేకువఝామున మూడున్నరకి ముహూర్తం!

వేసవికాలం!

వేడిగాలి విసురు విసురుగా తెరలు తెరలుగా వీస్తోంది.

నీలి ఆకాశం తారు రంగుని పులుముకుంది.

చీకట్లో దారి తెలీక గుడ్డి నక్షత్రాలు వొణికి వొణికిపోతున్నాయి.

ఆరుబయట కుక్కిమంచాల్లో, తుంగచాపల్లో వొళ్ళెరక్కుండా ఆడా మగా తేడా లేకుండా మాంచి నిద్రలో వున్నారు.

ఆ తొలిఝాము వేళలో కల్యాణవేదిక ప్రాంతంలో కళ్ళాపి చల్లే కార్యక్రమాన్ని ముగించారు అమ్మలక్కలు.

పురోహితుడప్పుడే రంగప్రవేశం చేశాడు.

ఎవరో అందించిన సెగలు, పొగలు కక్కుతున్న కంచుగ్లాసులోని కాఫీని సేవించడం ప్రారంభించాడు.

అలా కాఫీని సేవిస్తూనే కల్యాణ మంటపంలో నిర్మించబడిన హోమగుండం వంక నడిచాడు.

ఆ వెంటనే గొంతు చించుకున్నాడాయన.

"అమ్మాయ్ శాంతమ్మా! ఈ యజ్ఞగుండం చుట్టూ పసుపూ కుంకాలతో ముగ్గులు వేయించు తల్లీ!"

పురోహితుడి అనుజ్ఞ మేరకు అప్పుడే వాకిట్లోని సన్నాయి మేళగాళ్ళు కూడా పరికరాలకు పని కల్పిం



# రూ. 5000 బహుమతి పొందిన కథ

పెళ్ళికూతుర్ని అన్యమనస్కంగానే సిద్ధం చేస్తూన్న సుజాత వంక చూస్తూ శాంత కొంచెం కంగారుపడిన మాట వాస్తవం. పైగా ఆ గదిలోవున్న శంకరం బంధువులు కూడా ఆ విషయాన్ని గమనించినట్లుగా కొంచెం ఆదుర్దాని వ్యక్తం చేయసాగారు.

సుమని ముస్తాబు చేస్తూన్న ఆ అరగంటలో ఏదోవంకతో కనీసం నాలుగు సార్లయినా వచ్చి చంటాణ్ణి చూసి వెళ్ళుంటుంది సుజాత.

కాని ఆమె తన పనిని ముగించుకుని వచ్చేసరికల్లా చంటాడి పరిస్థితి కాస్తా దిగజారిపోవటం ప్రారంభించింది.

అది చూసి మధుక్కూడా వొణుకు పుట్టుకొచ్చింది.

"సుజాతా! నేనిప్పుడే వెళ్లి డాక్టర్ గారినోసారి కలసివస్తాను! కాని ఈలోగా నేను చెప్పిన విషయాన్ని మాత్రం మరిచిపోవద్దు" అంటూ గబగబా వీధిలోకి నడిచాడతను.

ఆ అపరాత్రివేళ తన మోపెడ్‌ని స్టార్ట్ చేస్తూన్న మధువంక వెర్రిచూపులు చూస్తూ వున్న శంకరం కాస్తా ఆ వీధి మూలనుంచి కదలలేకపోయాడు.

మధు మోపెడ్ స్టార్ట్ చేయగానే ఆ బండి హెడ్‌లైట్ కాంతిలో దూరంగా శ్రీను కనిపించాడతనికి. గోపాలరావు ఇంటినుంచి తిరిగి వస్తోన్న కొడుకుని చూడగానే అతనికి ప్రాణాలు లేచివచ్చాయి.

పెళ్ళివందిట్లోకి ఏదో వస్తువు అర్జంటుగా కావాల్సి వచ్చి వుంటుంది. మధు అందుకే వెళుతుండవచ్చునుకుంటూ ఆ క్షణంలో సరిపుచ్చుకున్నాడతను.

కాని ముందుకెడుతోన్న మోపెడ్ వెలుగులో తనకి దగ్గరగా వస్తోన్న శీను మొహంలో వెలుగు కనిపించకపోవటం చూసి అప్పటికే చీకట్లో వున్న అతని వదనంపై మరింత చీకటి కమ్ముకుంది.

"గోపాలరావుగారిప్పుడే వచ్చారు. వారికి రావాల్సిన డబ్బు యింకా చేతికందలేదట. మిమ్మల్ని క్షమించమన్నారు నాన్నా!" అంటూన్న శ్రీను గొంతుని వింటూనే శంకరం గొంతులోని తడికాస్తా ఆరిపోయింది.

గుండెపోటు వచ్చిన వాడిలా వెనక్కి విరుచుకుపడబోయిన తండ్రిని అతి కష్టంగా పట్టుకుని పెళ్ళిపందిరి దాకా తీసుకుని వచ్చి పార్క్ చేసి వున్న ఓ స్కూటర్‌పై కూచోబెట్టాడు శీను.

"మంచినీళ్ళు!.... అంటూ నీరసంగా పలికాడు శంకరం.

శీను యింట్లోకి పరుగుదీశాడు.

చల్లటి నీళ్ళు గొంతులో పడ్డాక కోలుకున్నాడతను. ఆ వెంటనే అతని బుర్ర వేగంగా పనిచేసింది.

"ఈ క్షణంలో తనని ఆదుకునే శక్తి భగవంతుడికొక్కడికే వుంది. ఆ భగవంతుడిపుడు తనకు 'మధు' రూపంలో అందుబాటులో వున్నాడు!"

మధు తిరిగి రాగానే 'సుజాత' గొలుసుని అడిగి తీసుకుని ఈ గండం నుంచి గట్టెక్కేయాలనే నిర్ణయానికొచ్చాక అతని మనసు కుదుటపడింది.

"తనిప్పటికే మధు కెంతో రుణపడి వున్నాడు! అతని మూలంగానే ఈనాడు తనకు ఓ, స్వంత ఇల్లంటూ ఏర్పడింది. అతని ప్రయత్నం వల్లనే తన కూతురికీరోజు పెళ్ళి జరుగబోతోంది. ఇంతెందుకు? తనీరోజు నిశ్చింతగా వుండగలుగుతున్నాడంటే అందుకు కారకుడు మధు!"

"స్వంత ఇల్లు !..." ఆ విషయం జ్ఞాపకం రాగానే తను ఒకప్పుడు ఓ మారుమూల వీధిలో ఓ ఇరుకు ఇంట్లో అద్దెకి వుంటం గుర్తుకొచ్చింది. ఆ అద్దింట్లో వున్నంత కాలం 'సుమ'కి సంబంధం అంటూ ఎవరూ రాలేదు.

"ఈ ఇంట్లో వున్నంతకాలం మీ అమ్మాయికి పెళ్ళి జరుగదు సార్!" ఓరోజు అప్రయత్నంగా అనేసిన 'మధు' వంక ఆరోజు దెబ్బతిన్న వాడిలా చూశాడు శంకరం.

కాని ఆ సాయంకల్లా ఆ కోపం చల్లారిపోయింది. పైగా మధు తీసుకువచ్చిన చల్లనివార్త అతన్ని ఆనందంలో ముంచేసింది.

"శ్రీనగర్ కాలనీలో చిన్న ప్లాటొకటి బేరానికొచ్చింది సార్! మూడొందల గజాలు... కొంచెం చవగ్గా వస్తోంది.. ధైర్యంచేసి మీరు సగం డబ్బుని ప్రావిడెంట్ ఫండ్ నుంచి తీసియిస్తే మీరూ నేనూ కలిసి దాన్ని స్వంతం చేసుకోవచ్చు. మనయిద్దరి పేరిటా రిజిష్టర్ చేయిస్తాను. ఆ తర్వాత నా పేరిట అప్లైచేసి ఇంటికోసం లోను తీసుకుంటాను. రెండు వాటాలుగా కట్టించి చెరోవాటాలో వుండిపోదాం! మీ అమ్మాయిల పెళ్ళిళ్ళు అయిపోయేవరకూ నెలనెలా 'లోను' ఇన్‌స్టాల్‌మెంట్‌ని నేనే కడుతుంటాను. మీకు వీలు కలిగినప్పుడల్లా మీ శక్త్యానుసారం మీ వంతు డబ్బుని చెల్లిస్తే చాలు!"

ఆధునిక వ్యవస్థలో
మనం కోల్పోతున్న
ఆత్మీయత,
త్యాగాల వెనుక
స్వార్థరాహిత్యమైన
స్నేహాన్ని ఆవిష్కరించిన
ఉదాత్తత, ఈ ఉత్తమ
కథ ప్రత్యేకత.

మధు చెప్పింది వింటూనే ఆనందంతోబాటుగా ఎంతో ఆశ్చర్యం కూడా కలిగింది శంకరానికి.

ఈ రోజుల్లో కూడా మధులాంటి మంచి వాళ్ళు వుంటారని అతనికిప్పుడే తెలిసి వచ్చింది. స్నేహాన్ని అంత అర్ధవంతంగా పాటిస్తూన్న మధుపై కొండంత వాత్సల్యం ముంచుకొచ్చిందతనికి.

... ఆ తర్వాత ఆరునెలలు తిరిగేసరికి తమ స్వంత వాటాల్లోకి మారిపోయారా యిద్దరూ....

"నాన్నా పెళ్ళికొడుకు బాబాయట! మిమ్మల్ని రమ్మంటున్నారు!" శ్రీను గొంతు వినిపించడంతో ఆలోచనల్లోంచి జారిపడ్డాడు శంకరం.

మధు రాకకోసం ఎదురుచూస్తున్న అతనికక్కణ్ణుంచి కదలటం యిష్టం లేకున్నా తప్పలేదు.

శంకరం లోని కొచ్చేసరికి అప్పటికే ఆ పెద్దాయనతో మాట్లాడుతోంది శాంత.

"పెళ్ళి కొడుక్కి వేణ్ణీళ్ళు సిద్ధంగా లేవండీ! విడిదింట్లో పుల్లలు మండటం లేదు. మీ ఇంట్లోని 'గీజరు'లో నుంచి ఓ బాల్చీడు నీళ్ళ నక్కడికి పంపే ఏర్పాటు చేయండి!" అంటూ వెనక్కి వెళ్ళిపోయాడాయన.

"గీజరు!" అనే సరికి గతుక్కుమంది శాంత. తమ యింట్లో గీజరెక్కడుంది? వెంటనే మధు యింట్లోని 'ఇమ్మెర్షన్ రాడ్' విషయం జ్ఞాపకం వచ్చిందామెకి.

"క్షణం ఆగండి అన్నయ్యగారూ!" అంటూ లోనికెళ్ళి 'రమ'ని మధు వాటాకి పరుగుదీయించింది.

'సుమ' చెల్లెలు 'రమ' లోనికి అడుగు వేయగానే ఉలికిపడింది సుజాత. విషయం తెలుసుకుని ఆ వస్తువునిచ్చేసి ఆ పిల్లని వెంటనే పంపించి వేసింది.

చంటాడికి అప్పటికే వొళ్ళు చల్లబోడుతోందన్న విషయం ఆమె దృష్టికింకా రాలేదు. వాడు పాలు తాగకుండా రొమ్ముని వదిలేస్తూ వుండటం చూసి ఏంచేయాలో తోచలేదామెకి.

ఆ క్షణంలోనే తిరిగివచ్చాడు మధు.

కంగారుగా అతనివంక చూసింది సుజాత.

"డాక్టర్ గారాన్ని కలిశాను సుజాతా! ఈ మందుని వాడికి పట్టించమన్నారు అంటూ భార్య ప్రక్కనే చతికిలబడ్డాడతను. అలా కూచుండగా అతని కళ్ళు ఆచ్ఛాదన తొలిగివున్న భార్య వక్షస్థలాన్ని గమనించాయి.

చేపులొచ్చిన సుజాత రొమ్ములోంచి పాలు ధారగా కారిపోతున్నాయి. ఆ విషయాన్నామె గమనించే స్థితిలో లేదు.

"చంటాడు పాలు తాగటం లేదండీ!" అంటూ గొల్లు మందామె.

కొడుకువంక అయోమయంగా చూశాడు మధు.

"మళ్ళీ ఓసారి ప్రయత్నించు సుజాతా!" అంటూ చంటాణ్ణి ఆమె రొమ్ముల మధ్యకి మొహం చేరేలా సర్దాడతను.

కాని తన రొమ్ముల్లోంచి పాలు వాడి మొహంపై చిమ్ముతుండగా నోరు విప్పని కొడుకుని చూస్తూ భర్తవంక నిస్సహాయంగా చూసిందామె.

"ఏమండీ! హాస్పటలుకు వెడదామండీ!" దీనంగా పలికిందామె గొంతు.

ఆమె వంక చురుగ్గా చూశాడు మధు.

"సుజాతా! యింకా కొద్దిసేపు ఓపికపడితే సుమ మెళ్ళో తాళిపడిపోతుంది. ఆ మరుక్షణంలో మనం హాస్పటల్లో వుంటాం. కొద్దిగా ధైర్యాన్ని కొనితెచ్చుకో!" అంటూన్న భర్త వంకా... చంటాడివంకా మార్చి మార్చి చూస్తూ వెర్రిదానిలా కుమిలిపోసాగింది సుజాత.

యింతలో ప్రక్కింట్లోనుంచి ఓ పెద్ద ముత్తయిదువ గొంతు పెద్దగా వినిపించింది.

"పెళ్ళి పిల్ల చేతులకి రెండురోజుల క్రితమే గోరింటాకు పెట్టాల్సింది. యిపుడాపిల్ల చేతులలా బోసిగా వుంటే ఏం బావుంది?"

అది వింటూనే 'ఉమా!' అంటూ మూడోకూతుర్ని పిలిచింది శాంత.

ఆ పిల్ల పరిగెత్తుకు వచ్చింది.

"సుజాత పిన్నింట్లో గోరింటాకు రెడీమేడ్ పేస్ట్ ట్యూబ్ వుంది. వెళ్ళి అడిగిపట్రా!"

ఉమలోనికి రాకముందే సుజాత లేచి నుంచుంది. చంటాణ్ణి మధుకందిస్తూ "నేను వస్తాను పద ఉమా! సుమ చేతులకి నేనే డిజైన్ వేస్తాను. నిమిషాల్లో బొమ్మ పండుతుంది!". అంటూ డ్రెస్సింగ్ టేబుల్ వంక నడిచిందామె.

...యింతలో కళ్యాణ మంటపంలోనుంచి పురో

హితుడు గొంతుచించుకున్నాడు.

చప్పట్లు.

ఆయన అరుపుని వింటూనే సన్నాయి మేళం వాళ్ళు తమ గరాల్ని సవరించుకున్నారు.

పెళ్ళికొడుకు వచ్చేసి పీటలపైన కూచోవటంతో కార్యక్రమం ప్రారంభమయింది.

తీరా కన్యాదానం... కాళ్ళు కడుగటం... అంటూ పురోహితుడు పురమాయిస్తున్నపుడు మగ పెళ్ళి వాళ్ల వైపు ఆడవాళ్లు కొందరు సుమ గదిలోకి వెళ్ళటం జరిగింది. సుమ మెళ్ళో గొలుసు లేకపోవడం చూసి తిరిగొస్తున్నపుడు వాళ్ల చెవులు కొరుక్కోవటాన్ని ప్రక్కనే వున్న శంకరం గమనించాడు.

వెళ్లి మధుని స్వయంగా గొలుసుకోసం అడగా లంటే మళ్ళీ మొహమాటం అడ్డొచ్చింది. దాంతో భార్యవంక చూశాడతను.

పెళ్ళికూతురు చేతులకు గోరింటాకుమా, కాళ్ళకు పారాణి తీర్చిదిద్దాక చేతులు కడుక్కుని తమ యింట్లోకి వచ్చేసిన సుజాత కాస్తా చంటాణ్ణి చూస్తూనే 'కెవ్వు' మంటూ అరవబోయింది.

దిగ్గున లేచి తన చేతితో ఆమె నోటిని మూసి వేశాడు మధు.

పడుకునివున్న చంటాడి గొంతు నీలంరంగుని సంతరించుకుంటోంది! వాడికి శ్వాస బాగా అందడం లేదన్న విషయం బాగా తెలిసిపోతుంది!

అదే క్షణంలో పెళ్ళి పందిట్లో పురోహితుడు గొంతు మళ్ళీ చించుకుంది.

"పెళ్ళి పిల్లని తీసుకురండి!"

చంటాణ్ణి వొళ్లో వేసుకుని కూర్చునివున్న మధు వంక మొదటిసారిగా తీక్షణంగా చూసింది సుజాత.

తమ తలుపుదగ్గర అలికిడి విని వెనక్కిచూశాడు మధు.

శంకరం, శాంతలు చేతులు నలుపుకుంటూ గడపలో నుంచుని వుండటంచూసి కొయ్యబారిపోయారు మధు దంపతులు.

"లోనికి రావటానికి మాకు మొహం చెల్లటం లేదు సుజాతా! కాని తప్పనిసరి అయిన పరిస్థితుల్లో నీ గొలుసు కోసం రావటం నాకు సిగ్గుగా వుంది" అంది శాంత. "తలతాకట్టు పెట్టయినా సరే రెండు రోజుల్లో నీ గొలుసును నీకు తిరిగి యిస్తానమ్మా!... మధూ! నన్ను క్షమించు!" అంటూ కళ్ళు తుడుచుకున్నాడు శంకరం.

"గొలుసు యిచ్చేసెయ్ సుజాతా! ఆలస్యం చేయకు!" అన్నాడు మధు.

గభాలున మెళ్ళోంచి తన గొలుసుని తీసి వెళ్ళి శాంత చేతిలో పెట్టేసింది సుజాత.

గొలుసు చేతిలో పడగానే పెళ్ళి పిల్లగది వంక పరుగుదీశారు శంకరం దంపతులు. వారి ఆదుర్దా వారిది! మధు యింట్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన ఆలోచన వారికి కలుగలేదు.

వెనక్కి తిరిగిన సుజాత చంటాడివంక చూస్తూనే భయంతో కళ్ళు తేలవేసింది.

చంటాడు నోరుతెరిచి శ్వాసకోసం ఆరాటపడుతున్నాడు.

"ఏమండీ! పదండి! హాస్పటల్‌కెడతాదం!" ఈ సారి సుజాత గొంతులో కొద్దిగా బలమైన నిర్ణయ ప్రభావం ధ్వనించింది.

"సుజాతా! నీ ఆవేదనని అరికట్టే శక్తి నాకు లేదు. కాని కేవలం మరో అయిదు నిమిషాలు ఓపిక పడితే చాలు!..." ఓ ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా అదే ఇంట్లోని మరో వాటాలో ఓ ప్రాణి చావు బతుకుల్లో మునిగి తేలుతోం దని తెలిస్తే ఆ శుభకార్యం కాస్తా ఆగిపోతుంది. సుమ పెళ్ళికి మనం అలాంటి ఆటంకాన్ని కలిగించకూడదు!" అంటూ యింకా ఏదో చెప్పబోతూ అర్ధాంతరంగా ఆగిపోయాడు మధు.

అతనడి దృష్టి చంటాడిపై పడింది.

వాడి నోట్లోంచి నొంగ కారుతోంది!

అది చూస్తూనే సహనాన్ని కోల్పోయింది సుజాత! యిహ భర్త మాటల్ని వినిపించుకోలదల్చుకోలేదామె! దాంతో గభాలున చంటోణ్ణి అందుకుని లేచి నుంచుంది.

అదే సమయంలో పెళ్లి పందిట్లో సన్నాయి వాద్యాలు తారాస్థాయి నందుకున్నాయి.

సరిగ్గా మూడుముళ్ళు పడే వేళలో పందిట్లో పెళ్ళివాళ్ళంతా తమవంక కళ్ళప్పగించి చూస్తుండగా వీధిలోకి పరుగుదీస్తున్న భార్యని వెర్రిగా అనుసరించాడు మధు.

కళ్యాణ మంటపంలో సుమ దంపతులపై అక్షింతలు చల్లుతూనే పందిట్లోనుంచి నిష్క్రమిస్తోన్న మధు దంపతుల్ని చూసిన శంకరం కళ్ళునీళ్ళని నింపుకున్నాయి.

వారలా అర్ధాంతరంగా ఎందుకు వెళ్ళిపోతున్నారో అనే విషయం అతనికి అంతుపట్టలేదు.

"అమ్మా శాంతమ్మా! తదుపరి కార్యక్రమం హోమం! అందుక్కావలసిన ఏర్పాట్లని చూడు తల్లీ!" పురోహితుడి కంఠస్వరం గంభీరంగా వినిపించింది.

"మనసు" అనే యజ్ఞగుండంలో "స్నేహం" అనే హోమాన్ని ధారపోసిన మధుకు మనసులోనే చేతులెత్తి నమస్కరించాడు శంకరం.

"సంతోష సమయంలో స్నేహానికి విశ్రాంతి!...

అపుడు బంధువులు దగ్గరవుతారు!

ఆపదకాలంలో బంధువులకు విశ్రాంతి!....

అపుడు స్నేహితులే దగ్గరి వారవుతారు!

తానొకసారి 'స్నేహం' విషయంలో పలికిన ఆ నాలుగు వాక్యాల్ని మననం చేసుకున్నాడు శంకరం.

ఆ తర్వాత, ఆ రాత్రంతా, ఆ వాక్యాలే అతని మనసులో ప్రతిధ్వనించాయి. ◆

# కర్మఫలం

అనుభవించేది
అనుభూతి పంచేది
ఇచ్చేది, పుచ్చుకునేది
పొందేది, పోగొట్టుకునేది
పూర్వజన్మ కర్మఫలం
అయినప్పుడు–
పశ్చాత్తాపాలు, పొగడ్తలు
పొరపాట్లు, నిందలు
అన్యాయానికి ఆక్రోశమూ
అభ్యుదయానికి ఆనందమూ
ప్రదర్శించటం దేనికి?
వ్యర్థ ప్రయత్నాలు
వృధా ప్రయాసలు ఎందుకు?
బుద్ధి కుశలత, శక్తియుక్తులు,
ఆశయాలు, వాటి సాధనలు,
అభివృద్ధి పథకాలు,
ప్రగతి ప్రణాళికలు,
సంస్కరణ వ్యక్తిత్వాలు,
కళాత్మక నైపుణ్యాలు,
సంక్షేమ వికాసాలు
విశాల హృదయాలు
స్వయంకృతాలని
భావిచటం ఎందుకు?

–సునీత

**Hyderabad, AP**

# తెలుగు వనిత

వెంకన్న పాదముల వినతులను జేసి
కోటప్ప కొండపై కానుకలనిచ్చి
దుర్గమ్మ గళములో దండలను వేసి
ఆదికవి నన్నయ్య ఆశీస్సు లంది
తిక్కన్న కైతలను తేజమును పొంది
ఎఱ్ఱన్న పదములను ఎడదయును పొంగ
పెద్దన్న అల్లికల జిగిబిగిలు చూసి
తిమ్మన్న మాటల మధురిమలు గ్రోలి
శ్రీనాధు సీసాల శృంగారమెంచి
పోతన్న పద్యాలు భావమున నుంచి
వేమన్న శతకమున నీతులను నేర్చి
కృష్ణమ్మ కెరటాల ఊయలల నూగి
గోదారి గానాల పరవశము చెంది
పెన్నమ్మతో పాటు పరుగులను తీసి
పైరగాలిని కూడి పాటలను పాడి
నల్ల మబ్బుల తోడ నాట్యములు చేసి
నీలి సంద్రము లోన పొంగు తరగలపైన
నావనొక్కటి యెక్కి
రసరమ్య భావాల రాగాల లోన
తేలిపోయెడి దాన
తెలుగు వనితను నేను
వెలుగు పడతిని నేను.

– సుప్రభ

**Morristown, NJ**